క్లుప్తంగా

యువతీ, యువకులను క్రీడల్లో ప్రోత్సహించాలి



రాజుపాలెం: అభివృద్ధి పథకాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పాల్గొనాలని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ 17 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఆటలలో పాల్గొనే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, తహసీల్దారు నళిని, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంఈఓ మల్లికార్జున శర్మ పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్య సంఘం కార్తిక వన సమారాధన

క్రోసూరు: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు శనివారం తెలిపారు. సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనదలచిన దంపతులు కమిటీ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సంఘం ప్రతినిధులు చుండూరు సత్యనారాయణ, దేవరశెట్టి నాగేశ్వరరావు తెలిపారు.

నేడు బ్రాహ్మణ ఐక్యవేదిక ...


సత్తెనపల్లి: బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ కార్తిక వనసమారాధన ఈ నెల 3న పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి ఫణికృష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా గోపూజ, అభిత కుసుమాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర సహిత త్రిగుండ చండీ హోమం 20 మంది రుత్వికులు పాల్గొని నిర్వహిస్తారన్నారు. అనంతరం మాతృశ్రీ శివానంద నృత్య కళాశాల నరసరావుపేట వారి భరత నాట్యం నృత్య ప్రదర్శన, మహిళలకు, చిన్నారులకు లక్కీడిప్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బ్రాహ్మణ కుటుంబాలు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయనతోపాటు ప్రధాన కార్యదర్శి కొడవటిగంటి నాగపార్వతయ్య శర్మ, కోశాధికారి అంపిరాయని రాజశేఖర్ ఉన్నారు.

ఎండీయూ వాహనం తనిఖీ



చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): నిత్యావసరాలు పంపిణీ చేసే ఎండీయూ వాహనాన్ని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ శనివారం తనిఖీ చేశారు. రైస్ కార్డు దారులను నిత్యావసర సరుకుల పంపిణీ లో ఇబ్బందులు ఉంటే చెప్పాలని సూచించారు. వాహనదారులు ఏమైనా ఇబ్బందులకు గురి చేస్తున్నారా తెలుసుకున్నారు. సరుకులను కార్డు దారులందరికీ అందించాలని వాహన నిర్వాహకులను ఆదేశించారు. సమయపాలన పాటించాలన్నారు. పంపిణీపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటరు నమోదులో అప్రమత్తంగా ఉండాలి



నకరికల్లు: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలను 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.నగేష్ సూచించారు. మండలంలోని అన్నిగ్రామాల్లోని పోలింగ్‌కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 63 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఫారం 6 - 27, ఫారం 7- 23, ఫారం 8 - 2 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆయా దరఖాస్తులు సకాలంలో పరిష్కరిస్తామని అన్నారు.

మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

పిడుగురాళ్లరూరల్: మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు బొడ్డపాటి దాసు అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు హ్యూమన్ రైట్స్ పౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవ హక్కులు , వినియోగదారుల హక్కుల పరిరక్షణ, పోస్కో చట్టం, జువైనల్ చట్టం, మానవ అక్రమ రవాణా చట్టం, బాల్య వివాహాల చట్టం, బాల కార్మికుల వ్యవస్థ రద్దు చట్టం, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ అథారిటీ చట్టం, బాలల హక్కుల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఏపీ స్టే ఫోగ్రామ్స్ కన్వీనర్ ఎస్‌కే దరియాబి(రజియా), అజయ్ కుమార్, తాషురినిషా పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంను చేద్దాం

- జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- గణపవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

రాజుపాలెం: కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించినందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని గణపవరంలోని గ్రామ సచివాలయం-1,2లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి అంబటి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, హెల్త్ సెంటర్‌లు, ఆర్‌బీకేలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. అందుకే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని కోరారు. కరోనా కాలంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రజలను అనేక విధాలుగా ఆదుకున్నాను కాబట్టే మళ్లీ నన్ను ఆశీర్వదించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్రంలో ఇదే విధంగా మళ్లీ సంక్షేమ పథకాల అభివృద్ధి జరగాలంటే వైఎస్ జగన్‌ను సీఎం చేసుకోవాలని, అంబటి రాంబాబును గెలిపించుకోవాలని కోరారు. తొలుత గ్రామంలో జరిగిన సంక్షేమ పథకాలకు, అభివృద్ధి పథకాలను తెలియజేసే గ్రామ సచివాలయం-1,2 డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, సర్పంచులు బొలమాల నాగమల్లేశ్వరరావు, పసుపులేటి సాంబశివరావు, ఎంపీటీసీ మంచు నందనం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సీతారాములు, బాల్‌రెడ్డి, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, మాజీ ఎంపీపీ వేల్పుల వెంకటేశ్వర్లు, మండల యూత్ కన్వీనర్ బత్తుల శివయ్య, మాజీ సర్పంచి వెంకటరమణ బుల్లిబాబు పాల్గొన్నారు.



గ్రామ సచివాలయం-1,2లలో డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి అంబటి, మాజీ ఎమ్మెల్యే యర్రం



15వ సచివాలయంలో సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నిమ్మకాయల, డాక్టర్ గీతాహాసంతి



75 త్యాళ్లూరులో సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

సామాజిక న్యాయం కోసం జగనే రావాలి

సత్తెనపల్లి: చట్టసభల్లో వెనుకబడిన వర్గాలకు స్థానం కల్పించి సామాజిక న్యాయం చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమని, అందుకే ఆయన మళ్లీ ముఖ్య మంత్రిగా ఆంధ్రప్రదేశ్‌కు కావాలని గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాల మేరకు పట్టణంలోని 15, 16 వార్డులకు కలిపి 15వ సచివాలయంలో శనివారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కనివిని ఎరుగని రీతిలో సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించిందన్నారు. ఏ ప్రభుత్వంలో ఎవరివల్ల మంచి జరిగిందో ప్రజలు ఆలోచించాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనపై రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఉన్న నమ్మకం మరింత రెట్టింపు అయిందన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకెళ్లిందన్నారు. కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా ఎటువంటి సిఫారసులు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ గంటా రమణమ్మ, 16వ వార్డు ఇన్‌చార్జి నందిగం ఆదాం, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పార్టీ నాయకులు గంటా ఏసుబాబు, చిలుకా రమణయ్య, గద్దం వెంకటేశ్వర్లు (బుల్లోడు), లోకామాధవ, రాజవరపు శివనాగేశ్వరరావు, ఉల్లంగుల ప్రసాద్ బాబు, శిరిగిరి వెంకట్రావు,తోట వెంకటేశ్వరరావు, మందడపు సాయి పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే పరిపాలన

పెదకూరపాడు: జిల్లా, మండల యంత్రాంగాన్నే మీ ఇంటి ముందుకు తీసుకొచ్చి సుపరిపాన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అన్నారు. మండలంలోని 75త్యాళ్లూరు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. తొలుత సచివాలయంలో సంక్షేమ, అభివృద్ధికి సంబంధించి డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను సచివాలయం వద్ద ఏగరవేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం కుటుంబాలకు అందిస్తున్న సంక్షేమం గురించి వివరించి వారి వద్ద నుండి అభిప్రాయం సేకరించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఏలాంటి లంచం లేకుండ ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించి, సంక్షేమ పరిపాలన తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ షేక్

వైభవంగా అంకాలమ్మతల్లి పునఃప్రతిష్టా మహోత్సవం

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): గ్రామంలో అంకాలమ్మతల్లి దేవాలయ శిలావిగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, హోమాల మధ్య ఆలయంలో అమ్మవారి ప్రతిష్టా మహోత్సవం జరిగింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యేయ యర్రం వెంకటేశ్వరరెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఇటీవలే గ్రామంలోని ఎస్టీ కాలనీలో టీటీడీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఎంపీపీ మారూరి పద్మ, తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి, మధిర వెంకటేశ్వరరెడ్డి, అన్నపురెడ్డి సాయిరెడ్డి, శిరిగిరి గోపాలరావు, బ్రహ్మారెడ్డి, పీలా లక్ష్మణ్ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

మెట్ట పంటలను ఆదుకున్న వర్షం

కారెంపూడి: తుఫాన్ ప్రభావం వలన శుక్రవారం కురిసిన వల్ల మండలంలో సాగులో ఉన్న పంటలకు మేలు జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.యలమందారెడ్డి శనివారం తెలిపారు. మెట్ట పంటలు బాగా బెట్టకు వచ్చిన తరుణంలో వర్షం పడడం వలన పంటలకు చాలా మేలు జరిగిందని చెప్పారు. కంది కల్లె దశలో ఉన్న కంది పంటకు వర్షం ఎనలేని మేలు చేసిందన్నారు. అలాగే మిర్చి పంటకు రైతులు నీరు పెట్టుకునే బాధలు తప్పాయన్నా వెంటనే పోవడం వల్ల పంటలకు ఎలాంటి నష్టం జరగదన్నారు.

నిమోనియాపై అప్రమత్తంగా ఉండాలి

పెరికపాడు(క్రోసూరు): పిల్లల్లో నిమోనియాపై అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ శనివారం సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ రవి ఆదేశాల మేరకు వైద్యాధికారులు బాల అంకమ్మ బాయ్, మహమ్మద్ సాద్, సిరి చందనల ఆధ్వర్యంలో మండలంలోని పెరికపాడు తండా అంగన్‌వాడీ సెంటర్లో నిమోనియాపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్యాంసన్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల్లో సంభవించే ప్రాణాంతకమైన వ్యాధుల్లో నిమోనియా తీవ్రమైనదని, వ్యాధి లక్షణాలు ద్వారా సులభంగా గుర్తించవచ్చునని ఆయన పేర్కొన్నారు. పిల్లల్లో నిమోనియా తదితర శ్వాస సంబంధ వ్యాధుల నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ సాన్స్ ప్రోగ్రాం ప్రవేశపెట్టిందని , వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు(2024) వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఐదేళ్ల లోపు పిల్లల్లో నిమోనియా లక్షణాలను గుర్తించటం జరుగుతుందన్నారు. లక్షణాల్లో ముఖ్యంగా జలుబు, దగ్గు అధికంగా ఉండి త్వరత్వరగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకునేటప్పుడు పక్క ఎముకలు కదలడం, అధిక జ్వరం రావడం, శ్వాస తీసుకునే సమయంలో శబ్దం రావడం, ఏమి తినకపోవడం, ఏమి తాగకపోవడం, అధికంగా నిద్ర పోవడం మొదలైనవి వ్యాధి లక్షణాల్లో ముఖ్యమైనవని అన్నారు. నిమోనియా నుంచి సురక్షితంగా ఉండాలంటే బిడ్డ శరీరాన్ని బట్టలతో పూర్తిగా కప్పి ఉంచాలని, ఇంటిలో పొగ లేకుండా చూసుకోవాలని, కిటికీలు తెరిచి ఉంచటం, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యమైనవని ఆయన అన్నారు. కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ షేక్ అమీర్ అహ్మద్, ఆరోగ్య కార్యకర్త పి.మల్లేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.మాధవి బాయి, షేక్ జరీనా, కేసీహెచ్ వెంకయ్య, జి.పూర్ణమ్మ, ఇంద్ర, విజయలక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.



నియోనియా వ్యాధి గురించి అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యవిస్తరణ అధికారి శ్యాంసన్

క్రీడా దుస్తులు పంపిణీ



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు శనివారం పంపిణీ చేశారు. స్థానిక విష్ణుశ్వర ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్ షాపు నిర్వాహకులు సహకారంతో ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో క్రీడ పోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వారిని ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం సంతోషమన్నారు. అడుదాం ఆంధ్రా పోటీల్లో సత్తా చాటుతామన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరెడ్డి, పీసీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ రాజేష్, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణశ్రీ, ఉపాధ్యాయులు నాగబాబు పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు కారెంపూడి విద్యార్థి ఎంపిక



కారెంపూడి: అండర్- 14 ఖోఖో జాతీయ పోటీలకు కారెంపూడి బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి బి.రెయిన్ పాల్ ఎంపికయ్యాడని పాఠశాల హెచ్ఎం బి.అనంత శివ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ వారంలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో రెయిన్ పాల్ మన రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడని హెచ్ఎం పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో ఇటీవల నిర్వహించిన ఎంపికల్లో రెయిన్ పాల్ ఎంపికయ్యారని చెప్పారు. పాఠశాల విద్యార్థి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందని, శిక్షణ ఇచ్చిన పీడీలు టి.శ్రీనివాసరావు, బి.స్వర్ణరాజులను అభినందించారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

మాచర్ల రూరల్: క్యాంపస్ ఇంటర్వ్యూలలో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంలో అధ్యాపకుల కృషి ఎనలేనిదని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి కొనియాడారు. మండలంలోని న్యూటన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో స్టార్ హెల్త్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థుల అభినందన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి ప్రత్యేకం కృషి చేస్తున్నారని చెప్పారు. క్యాంపస్ డ్రైవ్‌లో 29 మంది విద్యార్థులు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రైతాంగ సేవలన్నీ ఇంటి వద్దకే అందిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెంలోని గుంటూరు జిల్లా సహకార సంఘం ఆధ్వర్యంలో నాబార్డు ఆర్థిక సహకారంతో రూ.86 లక్షలతో నిర్మించనున్న వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న బహుళప్రయోజన గోదాము(మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్) నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను గ్రామంలోనే అందించేలా రైతు భరోసా కేంద్రాలను నిర్మించినట్లు పేర్కొన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందనప్పుడు నిల్వ చేసుకునేందుకు గాను అవసరమైన గోదాముల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని వివరించారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిత్యం ప్రజల బాగోగులు గురించే పాలన సాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ముప్పాళ్ల సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి సాయిరెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, మార్కెటింగ్ శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి సహకార బ్యాంక్ మేనేజర్ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరి గోపాలరావు, ఇందూరి నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సక్కా శ్రీనివాసరావు, బ్రహ్మారెడ్డి, పీలా లక్ష్మణ్, కోఆప్షన్ సభ్యుడు అజ్గర్‌వలి, సొసైటీ సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, సాయిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చాగంటివారిపాలెంలో గోదాము నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఓటర్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు చక్కని అవకాశం

సత్తెనపల్లి: ఓటర్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు చక్కని అవకాశం అని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఓటర్ నమోదు ప్రత్యేక శిబిరాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ ప్రతి ఓటరు మార్పులు, చేర్పులు, తొలగింపులను పరిశీలించుకుని అర్హత ఉండి ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోతే దరఖాస్తులను బీఎల్‌ఓలకు అందజేయాలని కోరారు. రెండు రోజుల పాటు ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రతి బీఎల్‌ఓ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూతు వద్ద అందుబాటులో ఉంటారన్నారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు పొందేందుకు ముందుకు రావాలన్నారు. అలాగే మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎస్.సురేష్ శనివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆదివారం కూడా ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా కార్యక్రమాలల్లో బూతు లెవల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు ...

మండలం	ఫారం-6	ఫారం-7	ఫారం-8	మొత్తం
సత్తెనపల్లిటౌన్	83	53	53	189
సత్తెనపల్లి రూరల్	73	40	73	186
ముప్పాళ్ళ	32	07	07	46
రాజుపాలెం	02	15	16	33
నకరికల్లు	27	23	02	52
మొత్తం	217	138	151	506



పట్టణంలో ప్రత్యేక ఓటర్ నమోదును పరిశీలించి సూచనలు చేస్తున్న కమిసనర్ కొలిమి షమ్మి

క్రోసూరులో..

క్రోసూరు: ఓటరు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డెప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాసరావు అన్నారు. క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎన్నికల స్టేషన్ల వద్ద ఏర్పాటు చేసిన ఓటరు నమోదు శిబిరాన్ని సందర్శించారు. కొత్తగా ఓటు నమోదు, అడ్రస్ మార్పులు, సవరణలకు , అభ్యంతరాలకు సంబంధించిన అన్ని రకాల దరఖాస్తులు బీఎల్‌ఓల వద్ద అందుబాటులో ఉంటాయని వాటి ప్రకారం కావాల్సిన విధంగా సమాచారాన్ని పొంది దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

పెదకూరపాడు: మండలం వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు ఆయా పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి దరఖాస్తులు తీసుకున్నారు. మండల వ్యాప్తంగా ఫాం-7 , 72, ఫాం 7, 120, ఫాం 8,13 వచ్చినట్లు తహసీల్దార్ జియాఉల్ హుక్ తెలిపారు. ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు కార్యక్రమం నిర్వహిస్తామని, యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

రంగవల్లికలతో వ్యవసాయ విద్యార్థినుల సందడి

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ అవగాహన కృషి అనుభం కార్యక్రమంలో భాగంగా చాగంటివారిపాలెం గ్రామంలో సేకరించిన సమాచారాన్ని రంగవల్లులతో రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కాలానుగుణ క్యాలెండర్లు, ట్రెండ్ అనాలసిస్ వంటి పద్ధతులను రంగవల్లికలతో ఆర్బీకే వద్ద రైతులకు అవగాహన కల్పించారు. సమస్యల చెట్టు పేరుతో అర్థవంతంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, విద్యార్థినులు ఆశ్రిత, భవాని, అనూష, మానస, నవ్యశ్రీ పాల్గొన్నారు.

ఇరుకుపాలెంలో....

మండలంలోని ఇరుకుపాలెంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన కళాశాల విద్యార్థినులు విలేజ్ మ్యాప్ రంగులతో ఆర్బీకే వద్ద తీర్చిదిద్దారు. గ్రామ భౌగోళిక పటం, పంట చేలు, ప్రభుత్వ పాఠశాల తదుపరి చిత్రాలను వేసి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు వరప్రసాద్, రమేష్, విద్యార్థినులు కృపా, లిల్లీగ్రేస్, మహాలక్ష్మి, నాగిని, మధుకావ్య పాల్గొన్నారు.



విద్యార్థినులు రంగవల్లులతో వేసిన సమస్యల చెట్టు వద్ద ఎంపీడీఓ పుట్టారెడ్డి, ఏఓ అరుణ

తుఫాన్ హెచ్చరికలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

నకరికల్లు: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు కోస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని నకరికల్లు, నర్సింగపాడు, త్రిపురాపురం గ్రామాల్లో వరి కోతలను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ వచ్చే సూచనలు ఉన్నందున కంబైన్డ్ హార్వెస్టర్ ద్వారా కోత కోయించి వరిపంటను ఎత్తైన ప్రదేశాల్లో రాసులుగా పోయాలని అన్నారు. వర్షానికి తడవకుండా రాసులపై టార్పాలిన్ పట్టాలు కప్పి జాగ్రత్త చేసుకోవాలని అన్నారు. ధాన్యపు రాసుల్లోకి నీటిచెమ్మ దిగకుండా రాసుల చుట్టూ 6 అంగుళాల లోతులో వర్షపునీరు పోయేవిధంగా గుంటలు తవ్వుకోవాలన్నారు. ప్రధానంగా కూలీలతో చేయించే వరికోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు.



వరి కోతను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

దివ్యాంగులకు చేయూత అభినందనీయం

మాచర్ల: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ప్రతి ఏడాది సూర్యకిరణ్ మానసిక వికలాంగుల సంస్థ నిర్వహించటం ఎంతో అభినందనీయమని మాచర్ల కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శారదా పేర్కొన్నారు. శనివారం రామకృష్ణ సేవా సమితి, స్వామి వివేకానంద సంస్థల ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. జడ్జి శారద మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సేవా సంస్థలు అందించే అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవింద రెడ్డి, సీనియర్ న్యాయవాది ఏడుకొండలు పాల్గొన్నారు.



సూర్యకిరణ్ మానసిక దివ్యాంగుల సంస్థలో విద్యార్థిని చేయూతనందిస్తున్న జడ్జి శారద

వరి పంట దిగుబడి ప్రయోగం

మిట్టగుడిపాడు(రెంటచింతల): మండలంలోని మిట్టగుడిపాడులో గణాంకశాఖ ద్వారా వరి పంట దిగుబడి అంచనా వేసినట్లు మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మరెడ్డి శనివారం తెలిపారు. గ్రామ శివార్లో ఖరీఫ్ 2023లో ఎంపిక చేయబడిన రైతు గోగిరెడ్డి స్రవంతి పొలంలో సాగు చేసిన వరిని పంటకోత ప్రయోగం చేశామన్నారు. వరి పంట సగటు 49 బస్తాలు రావడం జరిగిందన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా ఆంథోని

రెంటచింతల: మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సత్యాల ఆంథోనిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక హెర్మోన్ ప్రార్థన మందిరంలో నల్గొండకు చెందిన పాస్టర్ తిమోతి అధ్యక్షతన మండల దైవసేవకుల సదస్సు నిర్వహించారు. కార్యదర్శిగా కొమ్ము నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా దండే బాలజోజి, కోశాధికారి గా మంచాల జోసఫ్, కమిటీ ఉపాధ్యక్షులు తాడికొండ మరియదాసు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా మధిర కోటిరెడ్డి, పల్నూరి ఏసోబులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.